# పశ్చాత్తాపం

(శ్రీ మంచళ్ల సుదర్శనాచార్యులు.)

శకుంతల:-(స్వగతం) 'నీ ప్రేమపుష్పమునకై నాజీవిత సర్వస్వ మర్పణ గావించితిని. ఆ దర్శక దాంపత్య ధర్మ మార్గమే సతీపతులకు శ్రేయస్కరము. ప్రతిస్త్రీ తన శీలమును, మానమును, పతియానురాగమును 'బోగొట్టుకొనుటకు ప్రయత్నించ కూడదు. ఎల్లకాలములందును వెలుతురు నీడలవలె భార్యాభర్తలు మెలంగవలెను. ఇదే భారత హైందవనారీమణీ పాతివ్రత్య సూత్రము. ప్రేయసీ! నాయీ పలుకుల నాలకించి ప్రత్యహము పతివ్రతవై జీవితశేషమును గడుపుము"ని నాభర్త మున్నునా కుపదేశించినమాటలు తలుచుకొనినకొలది నాకు సిగ్గు కలుగుచున్నది. నే నేన్ని తప్పు లొనర్చినను, శీలభంగమునకు పాల్పడినను కర్ణాకర్ణికగా విని, ప్రత్యక్షముగా కండ్లార చూచి ఊరకుండెడివాడు. నాకు చావుదెబ్బలు తప్పవని భయపడే దానను కాని ఆధర్మరాజు నావంక కోపముతో చూచి ఎరుగడు. ఎప్పటికి శాంత వచనములతోనే మందలింపు. 'విను, సకూ-! నిన్ను చూస్తే నాకు విచారము జాస్తి అవుతున్నది. చిన్నదానవు. ప్రపంచానుభవము లేనిదానవు. అభము శుభము తెఱుగవు. ఈ పాశ్చాత్య నాగరికతా పిశాచమునకు దాసురాండ్రయి, ప్రతి లేవయనుఆడుది, తన పాతివ్రత్య ధర్మమును కోల్పోవుచున్నది. పురుషులును నాగరికత కేమి భంగముకలుగునో యని తమ భార్యల అత్యాచారమును సహించుచుండిరి. అందుపై భార్యలు తమ పురుషుల చనువు తీసికొని మరింత పెచ్చరిల్లుతున్నారు. సఖీ! నీవా రీతి నీచాతినీచపు ప్రవర్తనకు పాల్పడవద్దు 'ఈ విధంగా నిత్యము నా పేరుప్రతిష్ఠకై పాటుపడుచుండేవాడు. కాని ఆరోజులలో, భర్త అంటే లక్ష్యములేని దినాలలో, తల్లి తండ్రు లిచ్చిన దోహదమువలన కలిగిన సంతోషములో, మానభంగ కరమగు రహస్య........చర్యలలో నాకు పూర్తిగా మెట్ట వేదాంతమని తోచేది. నా చేష్టలను ఖండించి మందలించేది అప్పట్లో నాభర్తయే. తల్లిదండ్రులు చూచియు చూడనట్లుపేక్షించేవారు. అందువలన భర్త కూడ యెందు కుపేక్షించకూడదని వెత్తి ఆలోచన కలిగేది. దానికితోడు ఏక పత్నీవ్రత విషయమై శ్రీరామ ప్రభు డంతటి నాభర్తపై లేనిపోని నేరాలు కల్పించి చెప్పి నా మనస్సు చెడగొట్టింది నాతల్లి. చివరకు విసిగి, వేసారి, తన కృషి వృథాయై యున్నదని చింతించి యిల్లు వెడల నంపించాడు. అబ్బా! ఆనాడు నన్ను వీడలేక, నా తనూలావణ్యమును తదేకదృష్టితో చూచుచు, నాలో ఏమాత్రం విచారముకాని, పశ్చాత్తాపముకాని లేదే యని తెలుసుకొని నా భవిష్యత్తుకై కన్నీరుగార్చిన నాటి దృశ్యము యింకను నా కనులకు పొడగట్టుచున్నది. తెలివి మాలినదాననై, హితము నుపదేశించు ధర్మస్వరూపుని, దరహాస వదనుని, జ్ఞానమయుని, కరుణాస్వభావుని, నా యనుంగు ప్రియుని తూలనాడి, అలక్ష్య సంభాషణలాడి, చేతులార నాఅల్లారుముద్దు సంసారమును నాశనమొనర్చుకొంటిని. చిన్ననాటినుండి గారాబముతో పెంచి పెద్దచేసిన తల్లి మాటలపైగల తీపిచే యీ

రాతకు వచ్చితిని. సంఘ నియమమును పాటించియైన వర్తనను దిద్దుకొనుమని యెన్నియో విధముల నుద్బోధించినను భర్తపై అసహ్యపడి, లోకాపవాదును తల్లి గర్భము చాటునడాగి పోగొట్టుకొన నమ్మితిని. కాని ప్రతివారు 'ఇంకెంతకాల మాడుకూతురుని యింట నుంచుకొనెదవమ్మా! లోకమర్యాద యిదేనా' యని మా అమ్మను, 'అమ్మాయీ! ఎందాక నిన్ను పుట్టినయింట పోషించెదరు. వివాహమైనదానివి. చిన్న వయస్సులో నుంటివి. భర్త నిన్ను గొంపోవడా' అని నన్నును చీటికి మాటికి ప్రశ్నించుచుండిరి. మొదటమొదట వీరికెందుకు ఇంత బాధ్యత? బహుశా మా ఆయన తరఫున వచ్చిరేమో? అనియు ఆగ్రహించుకొనేదానను. కాని ఎవరిమీద నా ఆగ్రహము' ఆగ్రహించిన కొలది యిప్పటి స్థితిలోనున్న మరింత చులకనగా చూచును యీలోకము. తల్లి మాయమాటలకు లోబడి, ముందువెనుక యాలోచించక, పరువు మర్యాదలు వీడి, భర్త పుట్టింటదించినదే తడవుగా నిచటజేరిననాటి ఆనందము, గర్వము, నిర్విచారము, నిర్భయము, పొగరుబోతుదనము యిప్పుడు లేవు. నా యవస్థను తలుస్తే నాకే అసహ్యము. చేతులార కొఱవితో తలగోకుకున్నా- 'సఖ్యా-! నిన్ను పుట్టింట దిగవిడుస్తున్నా-ఇంక మరల నీపేరు తలపను. నీ ముఖమును కండ్లెదుట కన్పడ జేసుకొనుట మాన్తా. ఉత్తర ప్రత్యుత్తరములు జరుపను. మన యిరువురి ప్రేమలత నేటితో వాడి, శుష్కించి, నశించి పోవును. మన యిరువురి పూర్వ సమాగమ పరస్పరాలింగనములను మరచిపొమ్ము. కాని యింకొక విశేషము ముఖ్యముగా జ్ఞాపక ముంచుకొనుము. ఏనాటికైనా నీలో ఉండే యౌవనోద్రేకము పట్టరానిదై, అనేక కష్ట పరంపరలకు మూల కారణమై, నీచే అసహ్యపు పనులను చేయించును. ఇది ముమ్మాటికి నిజము. కడకు నీ యంతరాత్మ సంక్షోభించును. నీలో, నీ హృదయాంతరాళములో, నీ ప్రతినాడిలో పశ్చాత్తాపము శబ్దించును. అప్పుడు నిన్ను నీవే ఏవగించుకొనెదవు. అట్టిస్థితి నీకు భగవంతుడు త్వరలోనే కలిగించుగాక యని నా ఆశయము. ఏనాడు మండిపోవుచున్న హృదయముతో, పొంగులువారు దుఃఖాశ్రుపూరితములగు కన్నులతో, పశ్చాత్తాప దవానలముచే భస్మీపటలమైతినని గర్వ సుగుణాకరమగు నిర్మల హృదయముతో నా దరికి వచ్చెదవో, ఆనాడు, ఆ శుభ సమయమున, నీయందుకలిగిన మార్పుకు సంతసించి, వెనుకటి నీ దోసగుల నన్నిటిని మఱచి-వాటిని కరుణతో క్షమించవలసినదిగా సర్వాంతర్యామిని ప్రార్థించి మఱల ప్రేమవార్ధి తరంగ డోలికల నుయ్యాలలూపుటకు నిన్నంగీకరింతును. అంతదాక, జీవితాంతమువరకు నీకు పశ్చాత్తాపమే లేనిచో, త్వరపడి వేఱొక కన్యను పెండ్లియాడను. భగవంతుని సాక్షిగా యిది నా యిచ్చినబాస; యిక నే వచ్చెదన"ని ప్రేమరసము చిప్పిల మధుర భాషల నాకు హితోపదేశ మొనర్చి వెనుకకు మరలి, వెళ్ళుచు నా వైపు చూచిన కడసారి చూపు- అబ్బా! ఎన్నాళ్ళకూ మరువజాలను. గుండెలో సొరదిని పోయినది. ఎన్నడో తిరిగి నానాథుని దర్శనము. తప్పకుండ అతనివద్దకు వెళ్ళి క్షమింపుమని వేడుకొనెదను. నన్ను నా భర్త స్వీకరించునని అంతరాత్మ బోధించుచున్నది. ఈ సంగతినే—కాదు నాదృఢమనో నిశ్చయమును- నా తల్లి కెరింగింతును.

* * *

శకుం:-అమ్మా! నే నిచటికివచ్చి దాదాపు సంవత్సరము పైగా కావచ్చినది. మీ అల్లుడొక ఉత్తరము వ్రాసిగాని; చూచికాని పోలేదు. ఇరుగుపొరుగు వారు నన్ననేక విధముల దెప్పుతున్నారు. నన్ను వచ్చి తీసికొని పోవలసినదిగా వారికి ఉత్తరము వ్రాస్తా.

రుక్మిణి:-సకూ! నీకు పిచ్చియాయేమి- నీ భర్త నీకు చేసిన పరాభవము చాలకనా మళ్ల వెళ్ళుతానంటున్నావు. గోరంతతప్పు కొండంతచేసి నీ మీద కారాలు మిర్యాలునూరే దుర్మార్గుడే నీభర్త. వెళ్ళవచ్చులే-అతడే మనదగ్గరకువచ్చి నన్నింతకుముం దనిన మాటలకు క్షమాపణ గోరి నిన్ను పంపుమని నపుడే వెళ్లవచ్చు. అతనే చెప్పెగా! ఎవరెన్ని చెప్పినను, ఎన్ని కష్టాలు వచ్చినా మా అత్తకు మటుకు లొంగి పోనని- సరే! చూతాము. ఎంతవరకు నిన్ను వదలి ఉండగలడో? ఇప్పు డేమి తొందర.

శకుం:-ఇప్పుడేమి తొందర అంటావే- వచ్చి ఏడాది దాటింది. ఇంకెన్నాళ్ళు పంతానికి యీవిధంగా యిల్లులేక, వాకిలిలేక, సంసారము లేక ఉంటాను. నీవు లేనిది నాన్న, నాన్న కన్పడక పోతే నీవు, ఒక్క నిముష ముండలేరే-నా సంగతి కూడా అట్లాకాదూ? నేను తప్పకుండ నాన్న రాగానే ఉత్తరము వ్రాస్తా.

రు:-నిజమే;- నేను మీనాన్న ఎంత అన్యోన్యంగా ఉంటున్నాం. నామాట జవదాటరు మీనాన్న. నామీద కోపము వచ్చినా మ్రింగుకొని ఉంటంలే- అట్లా నీవు నీ భర్త ఉంటే చిక్కు లేనే లేదు. ఎంతసేపటికీ నీవాతనికి లొంగి వుండుటేకాని నీ కాతడు లొంగడు. లాభం? భర్తను స్వాధీనంలో పెట్టుకు ఉన్న ఆడుది ఏ పనైనా చేయగలదు (ఇచట ఒత్తి పలుకును.) ఎంతసేపు! నీ భర్త మటుకు నీకు స్వాధీనం కాదూ! కాని కొంతకాల మోపికపట్టు.

శకుం:-ఈ నీ పాడు ఉపదేశమే నన్నింతకు తెచ్చింది. భర్తపై అనురాగము, భక్తి, శ్రద్ధ, అణకువ కలిగియుండుమని చెప్పటకుబదు లిట్లాగే మునుపూ ఉపదేశించావు. నిజమేనని నమ్మి యీ విధంగా తయారయ్యా. నాభర్త నా స్వాధీనంలో ఉండకపోతే పోనీలే. అందరి ఆడవాండ్లకు వలె మన మున్నామా? నాన్నవలె నా భర్త ఉంటానికి. అదీగాక ఆడది భర్త యిష్టప్రకారము నడవాలె.

రుక్మి:-(కోపంతో) ఈ వెధవయేడ్పు అప్పుడే లేక పోయిందా?

శకుం:-ఇంకొకసారి చెప్పుతున్నా. కాని యికముందీ రీతిగా వెధవఏడ్పు, వెధవగోలా అంటేమాత్రం ఊరుకోను, నన్ను భర్తనుండి తాత్కాలిక ముగావీడదీయుటకా శాశ్వతంగా యెడబాటు కలిగించడానికా ఆ ఆశీర్వదించుతున్నావు-నా తల్లీ!

ఏ:-ఏమిటీ! ఇదా నీ అర్థము-భర్త వదలిపెట్టిన దానివని ఎంత గారాబంగా పెంచాను యీరోజు దాక; అంతా మంటిలో కలిపేవూ?

శ:-అవును. నాకుమటుకు తెలీదూ? నీప్రేమ విధానము. ఏనాడు నన్ను దెప్పిపొడవకుండా, యింటి చాకిరంతా పనిదానివలె నాతో చేయించకుండా, అసహ్యకరమైన, కృత్రిమమైన, లోకగర్హితమైన, అబ్బా!........యింకెన్నెన్ని పనులను నాతో చేయించకుండా విడిచిపెట్టావు. ఇక చాలు నాకు బుద్ధివచ్చింది. నాకు సెలవు యిప్పించు. నా భర్త కాళ్ళమీద పడుతా! ఒల్లడూ! ప్రాణ త్యాగమేకాని యిప్పటి పశ్చాత్తాపముతో మరి బ్రతికియుండ

జాలను. 'నిజంగా నీ తల్లి నీకు విషం నూరి పోస్తుంది. ఆమె మాటలు పైకి అమృత పూరములేకాని లోపలచాల విష పుచ్ఛములు. నమ్మి చెడిపోవద్దని నాభర్త యిదివరకే మందలించాడు. కాని వాటిని పెడ చెవినిబెట్టి నిన్ను నమ్మి కూర్చున్నా- ఆనాటిమాటలు మళ్ళా యిప్పాళ గింగురు మంటున్నై-అలాటి దానివే నువ్వు. అన్నయ్యా సంసారమును మంటగలుపుచున్నావు. పూనాది లేపావు. వాడి సంసార సౌధ మేనాడో నేల గూలుతుంది, నా సంసారానికికూడ ఎత్తువేసావు. కాని నాపతి నీవలలో పడలే; తప్పించుకున్నాడు. అలక్ష్యముచేసి తిరస్కరించినందుకు నాకీగతి కలిగించాడు. నిజంగా ఆయన ధన్యుడు నీ వలలోనే పడి యుంటే, అప్పుడాయన మనస్సు నే విధంగా తిప్పేదానివో? నాగతి యింకా ఎంత హీనంగా ఉండేదో? నాతల్లీ! తెలిసింది నీ హృదయము. అబ్బా! ఈగను వలలో వేసుకొనే సాలీడు యొక్క కృత్రిమ గృహనిర్మాణ సమానము నీ పాడుహృదయము.

*　　　*　　　*

(పోస్టు ప్యూను టెలిగ్రాం యిచ్చి వెళ్లును)

శకుం:-(చదివి, కాళ్లు చేతులు వడకగా) శ్రీహరీ! ఇంకేది తెరవు! ఇప్పుడు తల్లితో చేయుచున్న ప్రసంగము-ఆమె హృదయ రహస్య మెరిగిన తరువాత నా భవిష్యత్తును దలచుకొనిన కలిగిన భయంకర దృశ్యము-యీ టెలిగ్రాం-సరిపోయినవి. తల్లిదండ్రుల నడిగేదేమిటి భర్తకు జబ్బుగానున్నదని టెలిగ్రాం వచ్చినప్పుడు వెళ్లటానికి. ఏమి యీ టెలిగ్రాం! Brother Serious Wants sister-in-law Appadri. ఎంతటి శరీర దుర్బలతయో-ఇప్పుడెట్లుండెనో-అవస్థలో నుండికూడ, నేను తనయెడ చేసిన అపరాధమును మన్నించి, దయార్ద్ర హృదయుడై, రావలసినదిగా నాకు తంతిపంపిన భర్తను- నా ప్రేమమయుని- నా జీవిత సర్వస్వమును- నా శ్రేయోభిలాషిని, వదలి యీ తల్లి యింట- యీ భయంకర నారీపిశాచము కడ, యీ తంత్ర కార్యసాధని యింట- ఉండ దలచుటా! కలలోని వార్త- తక్షణమే తెల్లవారుఝామున ప్రయాణ మగుదును.

*　　　*　　　*

కన్నీరు కార్చుచు, పశ్చాత్తాపానల తప్తహృదయయై, శుష్కశరీరయై, మ్లానవదనయై, సుందరరావును తదేక ధ్యానముతో చూచుచు, ఔషధ సేవచేయించుచు, జావను త్రాగింపుచు రెండురాత్రులు గడపినది శకుంతల. ప్రతిరోజు అత్త, మరది అవసరము లేకుండానే శ్రద్ధతో ఉపచారములు సలుపుచున్నది. డాక్టరు వచ్చి నాడి పరీక్షించి వెళ్లుసమయాన భర్త యోగక్షేమములు విచారించుచుండేది. అత్తగారు బలవంతము చేయగా, యిష్టము లేనప్పటికి కంచము ముందర కూర్చొని లేస్తూండేది.

ఇట్లా వారము పదిరోజులు గడచినవి. సుందరరావుకు వ్యాధి తిరుగుమొగము పెట్టింది. శకుంతలకు ఆశాలత చిగురొత్తింది. అతడు ఇతరుల సహాయము లేకుండా లేచి తిరుగుచున్నాడు.

కాలచక్రముగతిని ఎవరాపగలరు. సెకండ్లు, నిమిషాలు, గంటలు, ఝాములు, పగలు, రాత్రులు దాటిపోతూనే ఉంటవి. ఇప్పటికి శకుంతల భర్త గృహమునకువచ్చి మాస మయింది. సుందరరావు సంపూర్ణారోగ్యము పొందెను. కాని భార్యాభర్త లిరువురి యెదుట న్యూనత అనే పెద్ద తెర అడ్డము.

ఒకనాడు ఏ మనుకొన్నాడో సుందరరావు తన గదిలో కూర్చొ నానుకొని 'సకున్కా! కొద్దిగా మంచి నీరు తే- దాహంగా ఉంది' అని పిలచాడు. అనడమే

తడవుగా వెండిగ్లాసుతో హాజరు శకుంతల. ఒకరి నొకరు గాఢంగా వీక్షించుకొన్నారు. శకుంతల నేత్రాల్లోవి బాధపశ్చాత్తాప భావాలు- సుందరరావు నేత్రాల్లో కరుణారసభావాలు ఒకరికొకరికి విశదమైనవి. శకుంతల తన హృదయ భారము నుశమించుకొనుటకు ముందంజవేసి భర్త పాదాలపైబడి 'క్షమించరూ! ఈ అజ్ఞానురాలిని, కృతఘ్నురాలిని, దోషిని' అంటూ దీనంగా ప్రార్థించింది.

సుందరరావుకు సహజ మార్దవ హృదయము చలించింది. లేవనెత్తి వేనలిని సవరించుతూ ప్రేమ మీర,

'సక్కూ! పశ్చాత్తాపమే నీ దోషములను హరించింది. నీ హృదయములో యిప్పుడు కల్మషము లేదు. యౌవన మదము లేదు. తిరస్కార భావములేదు- నిర్మలమగు అద్దమువలె ప్రతిబింబించు చున్నది. ముమ్మాటికి నిన్ను క్షమించి అంగీకరించా- ఈ విషయమై మొదటనే నీకు అభయహస్తమిచ్చియుంటినిగా- తరుణ మరు దెంచినది- నీదోషములను నీవు గుర్తెంగితివి. భయపడవద్దు. ఇక ముందైన సత్ప్రవర్తన కలిగి, దాంపత్యానురాగమును ఎఱింగి, ప్రపంచ ధర్మములకు లోబడి మెప్పుగాంచుము- భగవంతుఁడు నిన్ను సర్వదా కాపాడి రక్షించు గాక.-

ఏదీ ఒకసారి నవ్వు. అబ్బా! ఎన్నాళ్ళయిందో నీవు నా ప్రక్కన కూర్చొని నవ్వుతూ మాట్లాడి- (చక్కిలిగింత పెట్టును.)

శకుం:-నవ్వుతూంటేనే చక్కిలిగింత, ఊరుకుందురూ! ఈనాటికి ధన్యనైనా.

సుం:-నేను క్షమించి తిరిగి అంగీకరించినందుకు మరి ప్రతి ఫలమో! ఏదీ! ఒకసారి నీ చెంపల......

ఇంతసేపటిదాక మేల్కొని ప్రసంగాలా- చాల్లే! బిగియూరు కౌగిలింతల పెనవేసికొన పొందు- నేను అందుకనే వెదుతున్నా- అంటూ పంచమినాటి శుక్లపక్షమునందు రజనీ కాంత కౌగిట్లో దూ కా డు కొంటెమ్మగాంకుడు నడిరాత్రివేళ సుందనరావుకు, తులాద్వితుయుడై ఏమేమి పలుపుకున్నారో ఆ అమృత మయమగు రాత్రివేళ-పునః సమాగమము కాదు మరి! పాపం!


## హస్తరేఖాశాస్త్రము



విశదముగా తెలియగల 300 చిత్రములతోగూడి స్త్రీలు బాలుర సైతము చదువుట కనుకూలించు తేట తెల్లమగు నాంధ్ర వచనరూపమగు నీగ్రంథముచేత ఆయుస్సు వివాహలాభము, గుణము, శక్తి, బుద్ధి అదృష్టము, సంతానము లౌకిక సుఖము వ్యాజ్యము. శక్తి ఐశ్వర్యము, గండము, జయము, వ్యాధి, ఋణము, అపాయము మోసము, జ్ఞానము, దుఃఖము, కార్యసిద్ధి, దయ మరణము మొదలగు ననేక విషయములను సులభముగా దెలిసికొన వచ్చును. ఇంకను, విధిప్రేరణము, జీవిత రహస్యములను తెలియజేయుటకై గల్గు సాధనంబు లన్నింటి లోను యిది యగ్రస్థానంబును వహించియున్నది. భూత భవిష్య ద్వర్తమానంబులని చెప్పబడు త్రికాల వృత్తాంతంబులను దెలియుటకు ఈ గ్రంథము కల్పవృక్షము వంటిదని దీని నామూలాగ్రము ఒక్కమారు చదువువారే చెప్ప సాహసింతురనుట నెంతయు సందియంబు లేదు. దీని వెల 2-0-0.

సౌకారుపేట, ఆనందబోధిని ఆఫీసు. మదరాసు.